'లంఘనం పరమౌషధం'

'కరుణకుమార'

"వంకాయలున్నై, పచ్చిమిరపకాయలున్నై, అరటిపళ్లున్నై"

"అరటిపళ్లెట్లా ఇస్తావు?"

"అణాకు పదిస్తుండానమ్మా."

"ఆ! బజారులో పదహారు వంతున దిబ్బలు దిబ్బలుగా ఇస్తుంటే."

"లేదమ్మా."

"మొన్న మేం తెప్పించుకోలేదూ!"

"అవ్వేవో జబ్బురకం తల్లీ."

"నీవి మేలురకంగాబోలు, అన్నీ ఒకటేరకం."

"లేదు తల్లీ! పొద్దన్నే తమతో బేరంఎందుకు, పదకొండుచేసి తీసుకో అమ్మా."

"పద్నాలుగుచేసి యిస్తే ఇయ్యి-లేకుంటే వెళ్లు"

"మేం వేంతినేది తల్లీ?"

"అన్నం—"

"మీ బోటిగొప్పవారే ఇట్లా బేరంచేస్తే మాకు అన్నం ఎట్లావస్తుంది తల్లీ."

"ఊళ్లోవాళ్ళకందరికీ మేం అన్నం పెట్ట లేమయ్యా! నీకిష్టమైతే ఇయ్యి—"

"నేనుకొన్నదే పన్నెండువంతునకొంటే నీకు పద్నాలుగెల్లా గిచ్చేది తల్లీ."

"నాకదంతా తెలియదు—"

"లేదమ్మా: పన్నెండుకాడికి కొన్నాను: అణాకు ఒక్కపండులాభం. తల్లీ నీకుగాబట్టి పదకొండుచేసి యిస్తుండా. దయుంచు."

"లేదు లేదు: పద్నాలుగుకు ఒక్కటితక్కువైనా నాకవసరంలేదు—"

"సరే: తల్లీ! నేకొన్నకాడికేయిస్తా: పన్నెండుచేసి తీసుకో—"

"ఆరి నీ పంతం పాడుగాను."

"లేదమ్మా: దణ్ణంపెడతా పొద్దన్నేనీకు. ఎప్పుడూవచ్చే ఇల్లుకదాఅని—పోగొట్టుకోలేక లాభం లేకపోయినా యిస్తుండా—తీసుకో అమ్మా."

"అణావిక్కద్దు-ఓ అర్ధణాపళ్లుచాలు-"

"అయ్యో తల్లీ: ఓ అణావి ఉంచుకో అమ్మా. మళ్ళా నేను నాలుగు రోజులుదాకా రాను"

"మాఇంట్లో తినేవారేలేరు; ఖర్చుకావు."

"అర్ధణాపళ్లు ఎన్నాళ్ళుంటాయి తల్లీ—"

"అర్ధణాకయితే ఇవ్వవాఏమిటి చెప్పు—నాకు పొద్దెక్కతోంది-నీతో కూర్చోలేను—"

"సరే:తీసుకోతల్లీ-నీచలవఉంటే అంతేచాల్లే."

"మంచి వియ్యావోయ్."

"నీ కాడనే దాచుకొంటానా తల్లీ."

"చూడు. ఆకాయ డాగుపడింది."

"డాగు కాదమ్మా: పైతొక్కకొంచెం-"

"కుళ్లిందేమో?"

"కుళ్లితే నాకు డబ్బులివ్వబోకండి: చెడిపోయినసరుకు అమ్ముకొని, నేనెంతకాలం బదికి ఉండాలమ్మా-ఈలోకంలో-"

"కాయలు గట్టిగాఉన్నాయి ఏమిటోయ్."

"లేదు తల్లీ: భోంచేసుకొని మరీ డబ్బులియ్యండమ్మా నాకు. ఇప్పుడు తొందరలేదు."

"....................."

"వంకాయ లక్కరలే తల్లీ"

"ఎందుకు పాడువంకాయలు, తినితిని మొఖం కొట్టింది."

"వెన్నపూసలాగుండాయి తల్లీ : ఇవ్వేళే కోసుకొచ్చాను."

"... ... ..."

"ఓ వీశకాయలు తూచుతా."

"ఎందుకు? నీకెక్కడా అమ్ముడుపోలేదా ఏమిటి?"

"అరవీశ వేసేదా ?"

"అసలు ఎట్లా ఇస్తున్నావు?"

"నీ యిష్టంకాడికి మీరిపోనులే తల్లీ."

"నిన్న వీశ అర్ధణాకి తీసుకో అని తోటపల్లి గొల్లది కాళ్ళమీద పడేసింది-ఖర్చు కావని వద్దన్నా."

"అయ్యో : తల్లీ: అన్నిటికీ ఇట్లా బేరంచేస్తే మాకు ఈ ఎండలో తిరిగిన కూలయినా గిట్టవక్కర లేదా తల్లీ . ఈకాయ లట్లాంటివికావులే, ౹ణాచేసి యిస్తుండా. ఓ అరవీశతూస్తా.

"అణానా ? సడేలే. పొద్దున్నే బేరం బాగానేఉంది—"

"వీశకు చిన్నడబ్బుంటేచాలు తల్లీ ? నాలుగు వీశలు తెచ్చాను. ఒక్క అణాడబ్బులు వంకాయల్లో మిగిలితే చాలనుకొని తెచ్చా. మాకేమైనా స్వంతతోటలుండాయా తల్లీ! మారాజులు మీరు. మావంటివాళ్ళని పూటకి పదిమందిని పోషించగల మారాజులు. మీరే ఇట్లా బేరంచేస్తే మేంబతికేది ఎట్లా తల్లీ ?"

"సరేలెద్దూ. నీతులకేమి ? అర్ధణాకిచ్చేటట్టయితే ఓ అరవీశఇచ్చిపో . లేకుంటే నీదారిన నీవుదయచెయ్యి—"

"సరే. నీఇష్టమేకానియ్యమ్మ: ముక్కాని చేసుకొని తీసుకో: ఓ వీశఇమ్మంటావా"

"ఎందుకూ! వీశా: అరవీశాను: సంతర్పణం చేయమంటావా ఏమిటి ? ఓఏబులంతూచు—"

"ఏబులం ఎట్లాగమ్మ? లెక్క సరిపడదే: ఏబులం చిన్నడబ్బుకాడికి తీసుకో—"

"సరేలే ఏబులానికో బేరం, వీశకో బేరమూనా. నీదంతా ఎగతాళిగాఉందే—"

"వీశ ముక్కానయితే ఏబులం ఎట్లామ్మ గిట్టేది. రెండు దమ్మిడీలకు కొంచెంఎక్కుందే—"

"నీఏడుపుమండిపోనూ. ఏబులానికి ఇంకా నాలుగుకాయలు అదనంగావేసి చిన్నడబ్బుతీసుకొని పోరా. ప్రాణాలు కొరికేస్తున్నావు"

"అయ్యో మాలక్ష్మి: నీకు దణ్ణం పెట్టుకోవాలమ్మ. సరే తీసుకో అమ్మ"

"నీకు అరటిపళ్ళకూ, వంకాయలకూ ముక్కాని ఇవ్వాలి"

"పొద్దున్నే బోణీచేస్తే నీచేతిచలవ చల్లంగా ఉంటుందమ్మ"

"ఇప్పుడు చెయ్యితీర లేదురా. ఇంటికిపొయ్యేటపుడు రా"

"సరేతల్లీ: పచ్చిమిరపకాయ లక్కరలేదా అమ్మ"

"పచ్చిమిరపకాయలూ వద్దూ, పండుమిరపకాయలూ వద్దూ—"

అరటిపళ్లూ వంకాయలూ ఒడిలోవేసుకొని సరోజిని వాకిట్లోనుండి ఇంట్లోకిపోయింది. కూరలవాడు - తట్టను నెత్తిమీదికెత్తేవాళ్లులేక - తనే కష్టంమీద నెత్తికెక్కించుకొని - అసలే అప్పళించుకొని వెన్నుకు అంటిపెట్టుకొనిఉన్న కడుపును చెవిబట్టుకొని వెనుకకు తనలోనికి లాగుతూఉండగా అడుగులు వేసుకొంటూ - "ముక్కానిబేరం: మూడుజాములయిందిగదా. పిల్లలెట్లా గబ్బా బతికించేది. ఇంటికాడ వోపలేనిమనిషి. కూడయినా వొండుకుందో లేదో" అని అనుకుంటూ నడవదిగి - బయటి ప్రాకారందాటి - వీధినబడి - "వంకాయలు, పచ్చిమిరపకాయలు -" అని అరుచుకొంటూ పూర్వజన్మంలో.

పెట్టిపుట్టిన సంపన్నగృహస్థుల సౌధరాజములచే శోభించే బజారున బడిపోయినాడు.

౨

" అమ్మా కూరలేవీ అక్కరలే—"

" ఏంతెచ్చావే ? "

" పొన్నగంటాకూ: దేవదారాకూ "

" దేవదారాకేమిటే ! "

" ఇట్లావచ్చి చూచిపోఅమ్మా: నెయ్యేసి వండుకొంటే కమ్మంగా ఉంటుంది. "

" దేవదారాకా ? ఏంచిత్రమే ! కాలంమారినకొద్దీ కూరలుగూడా మారుతున్నాయి కాబోలు—"

" దేవదారాంకే తినలేదా తల్లీ : మావూరుకు తూర్పుతట్టు నల్లబోడుకుపోయి కోసుకొచ్చా. "

" ఈ కూర ఉడుకుతుందా? "

" అయ్యో! పొయ్యిమీద పెట్టేవరకు వెన్నముద్దయిపోతుంది తల్లీ. తెల్లవారుజామున కోళ్లుకూసిన పుడు లేచిపోయి తెచ్చా. ఇయ్యేళ వొండిచూడు"

" ఏమండీ దేవదారాకట. కొనమంటారా? -కు కూరలంటే మీకిష్టమేగా "

"ఆకుకూర లేవితిన్నా విరేచనబంధం ఉండదు. తీసుకో. "

" ఈరాగిగింజలు పుచ్చుకొని కాస్త దేవదారాకూ, కాస్త పొన్నగంటాకూ పెట్టవే, నాకు పొద్దెక్కింది. "

"......................"

" ఆ గింజల కిదేనా ఏమిటికూర. "

" నా బంగారుతల్లీ, ఎప్పుడొచ్చినా బేరం ఆడందే తీసుకోదు. ఊ, తీసుకెళ్లు "

" అయ్యో, నీ చెయ్యి పడిపోనుగదే. చేతిలోకి ఏమైనా వచ్చిందటే "

"......................"

" గింజలు ఊరికేనే ఒళ్లోపోసేవరకు- వీళ్లకేమీ లెఖలేకుండా ఉంది. దోసిటితో దోసెడుగింజలు తెచ్చి పోశాను దీని మొఖాన్ని. "

" లేదులే తల్లీ శానా పెట్టాను. "

" ఏమిటే ? ముష్టిపెట్టినట్టు పెట్టుతున్నావు. చాల్లే. నీకూర నీవుతీసుకొని నాగింజ లిట్లా నాకియ్యి "

" లేదులే అమ్మా. కోపం చేయబోకమ్మా "

" ఏం నడమంతర పాడుదానివే. నీదగ్గరే ఇంత శాణీతనం ఉంటే ఇక మాబోటివాళ్లదగ్గ రెంత ఉండాలో అనుకొంటా. ఇందాకటినుంచి చూస్తూన్నా. వేస్తున్నట్టుగానే వట్టిచెయ్యినే దులుపుతుందిగాని చేతులోకి ఆకేరాను. దీనిశాణీతనం మండిపోను. "

" అబ్బబ్బ. మాఅమ్మ పొద్దస్తమానులూ కొసురుతూనే ఉంటుంది. కడుపుచల్లంగా ఉందా- దిక్కులేనిముండ ఎట్లా బతకాలో అనేనా లేదు మా అమ్మకు. "

" నీ నవ్వు నిర్మాల్యంగానూ. నవ్వెందుకే? "

" అమ్మా, తొడుక్కోను రవికలేదు. నీచెమటకు మాసింది ఓపాతరవికె పారెయ్యమ్మా. నీకు రోజూ కరివేపాకు తెచ్చిపెడతా. అమ్మ అమ్మ "

" మీకు చీరెలూ, రవికెలూ సారిపంచిపెట్టడానికి మాకేమీ జమీలు లేవు. "

" అమ్మ! అమ్మ! మొన్ననే బిడ్డనుకన్నా. బాలింతరాలిని వీధినబడిపోవాలంటే సిగ్గవుతోంది. నీకు దణ్ణంపెడతా. ఒక్కపాతరవికె పారెయ్యమ్మా. చూడు, నీకు రోజూ కరివేపాకూ, పొన్నగంటాకూ తెచ్చిపెడతా తల్లీ. "

" ఇప్పుడు నాదగ్గర ఏమీ లేవే. నన్నాట్టే వాగించకు. "

" ఎన్నాళ్లనుంచి అడుగుతుండా తల్లీ "

" అడిగితే ఇక్కడ సిద్ధంగా ఉండొద్దూ "

" నీదయ తల్లీ. ఏంచేసేది. మమ్మల్నిట్లా పుట్టించినందు కనుకోవాలి. "

అని అనుకొంటూ ఆకుకూరల వ్యాపారంలో ఆర్జించి జీవించే ఆ ఆడపడుచు వెళ్లిపోయింది.

3

"అమ్మా, ఉట్లూ గంపలూ బుట్టలూ కావాలా"

"....................."

"ఉట్లు అమ్మా ఉట్లు-గంప లక్కరలే"

"ఎట్లా ఇస్తావు."

"నీ ఇష్టంకాడికి తీసుకో అమ్మా అడిగేదేముంది. గంప తవ్వెడుగింజల కిస్తా"

"ఇకనేం, సంసారాలు చేయనక్కర్లేదు. చాల్లే ఇక వెళ్లండి. ఈ ఎరుకలముండలికి దురాశ."

"అమ్మా, పోబోకమ్మా, ఎట్లా తీసుకొంటావో చెప్పరాదా అమ్మా"

"గింజలంటే మీ కేం లెఖలేకుండా ఉందే."

"ఈ గంప కావాలా. ఆ గంప కావాలా."

"నాకిదే కావాలి. ఎద్దుకు దాణా పెట్టుకోను గంపలేక ఇబ్బందిగా ఉంది. ఇదే తీసుకొంటా."

"దీన్ని తవ్వెడు గింజలకడిగితే ఇవ్వలేదమ్మా"

"సరే: ఇంకా ఇక్కడజాస్తీపెడతాగని వచ్చావు కాబోలు పాపం."

"నువ్వెంతకు తీసుకొంటావు చెప్పమ్మా"

"సోలెడు గింజల కిచ్చి పో."

"కడుపు నిండదు తల్లీ—"

"అయితే పో. ఉట్లు ఎట్లా ఇస్తావు."

"ఒక్కొక్కటి మూడు సోలల గింజలకి తక్కువ లేదు."

"మీకేం లోకం కింమామీదూ తెలియడం లేదే. నోటికివచ్చినంత ఖరీదులు చెప్పుతున్నారు."

"ఎన్ని తీసుకొంటావమ్మా."

"బేరం కుదిరితే ఒక ఉట్టీ, ఒకగంపా తీసుకోవాలనే ఉంది: అయినా మీ ఎరుకులవాళ్లతో బేరం, ఎముకలు కొరుక్కు తింటారు."

"అయ్యో: తల్లీ, అడుక్కొను వస్తే ఆసాములు ముష్టిపెట్టకుంటే, ఇట్లాంటివేనా చేసుకొనక పోతే ఎట్లా గమ్మా కడుపులోకి గంజి వచ్చేది— మీరు మారాజులు."

"సరేలే: గంప సోలెడుకూ, ఉట్టి మూడు అర సోలలకూ ఇస్తావా ఇవ్వవా?"

"కడుపు నిండదు తల్లీ."

"సరే పొండి: ముష్టిముండల్లారా: మీ తో నే ఊరేగుతోందా ఏమిటి లోకం— పనిలేదులే పొండి."

"పో బోకమ్మా: కోపంచేస్తే ఎట్లాగమ్మా."

"మీతో సమానంగా నే నీ సుంజిళ్లు పెట్టలేను. ఆకాడికిస్తే ఇవ్వండి లేకుంటే పొండి."

"సరే: తీసుకో అమ్మా: నీకడుపు చల్లంగా ఉంటే అంతేచాలు మాకు."

"... ... ..."

"అదేందమ్మా: గింజలునిండా ఇంతదుమ్మూ, ఇంతపొల్లూ ఉంది: మంచిగింజలు పెట్టమ్మా."

"అయ్యో: ఇదేం పాడ్యే కాలమే మీకు. ముత్యాలవంటి గింజలు తెచ్చి పోస్తే— దుమ్మంటావు: ఛీ! మీతో బేరం చేయడమే బుద్ధితక్కువ."

"అమ్మా:నువ్వు కొలిచేది సరిఅయిన సోలేనా."

"ఇదిగో, నా కొట్టే కోపం తెప్పించబోకు. నేను సరిఅయిన దాన్నికాను: మీకేమైనా కళ్లు దిం మ కొని పోయినాయా ఏమిటి? ఈనాడు మీకే కొత్తగా కొలుస్తున్నానా. పిచ్చసోలలతోనూ, పిచ్చ తవ్వలతోనూ కొలవడం నాకు చేతగాదు—"

"సరే: ఇయ్యమ్మా."

"... ... ..."

"అమ్మా: చంటిబిడ్డ ఒడిలో ఉండాడు — నిన్నటినుంచి కూడులేక పాలెండిపోయినై.వీణ్ణి మెడలో తగిలించుకొని తిరగలేకుండా ఉన్నాను: శోషవస్తోంది- ఒక్కపిడచ అన్నంపెట్టమ్మా: చచ్చినీకడుపునపుట్టుతా".

"సరే: పుట్టక పుట్టక నీవంటివాళ్ళే పుట్టితే మేం తరిస్తాం. — ఇప్పుడు నీకోసం మేం అన్నాలు వండి పొయ్యలేదు. వెళ్లండి."

"అమ్మా: అమ్మా, కణ్ణం పెడతా తల్లీ. నీకు పుణ్యం ఉంటుంది."

"ఈ వెధవ గోడు నే పడను. కూటికి లేని వెధవల కీ సంతానం ఎందుకో. పొండి పొండి."

"చంటిబిడ్డమాడున పెట్టుకొంటా — ఇంత ఆముదంచుక్క చేతులో వెయ్యమ్మా. పోతాం—."

"అబ్బ బ్బ: ఈ ఎరకల ముండలు మొండి ముండలు. పట్టుకొంటే పిశాచాల్లా వదలరు. ఇప్పుడు నీకోసం చము రెక్కణ్ణుంచి తెచ్చేదే?"

"అమ్మా: అమ్మా: చంటిబిడ్డ. చూడమ్మా మాడు ఎండిపోతోంది — ఒక్కబొట్టు పెట్టమ్మా."

"ఇప్పుడు నాకు చెయ్యివూరుకో లేదే. పొండే" అంటూ చేతిలో గంపా, ఉట్టీ తీసుకొని వీధితలుపు దగ్గరగా నెట్టి — లోపలికి చిటచిటలాడుతూ వెళ్లిపోయింది సరోజనమ్మ.

"అయ్యో: ధర్మాత్మురాలు — మా అమ్మ— నూరేళ్లు నిండాలి." అని దీవిస్తూ ఎరుకలమ్మలు వచ్చిన దారినే పోయినారు

౪

శేషశాయి తీవ్రమైన సామ్యవాది. అయినప్పటికీ కొన్ని అనివార్యమైన కారణాలవల్ల అతనిభావాల్లో ఉన్న తీవ్రత కార్యాల్లోకి ఇంకా దిగలేదు. బీదా సాదా అంటే అపరిమితమైన కరుణా, దయాను. తిర్యగ్జంతువులయిన పశుపక్ష్యాదులకేగాక, అచరములైన వృక్షాలయినప్పటికీ చీమకాటంత బాధ కలుగగా చూచి విలవిల్లాడే కుసుమ కోమలమైన హృదయం అతనిది. ఇక పరమేశ్వరుని సృష్టిలో మిక్కిలి పవిత్రమైన మానవ జన్మ ఎత్తిన ప్రజలయొక్క—అందులోనూ దరిద్రులయొక్క—కష్టపరంపరలు చూచినప్పుడతనిమనస్సెటులు క్షోభించునో అది ఊహింపదగిన విషయమేగాని వర్ణించవలసినది గాదు.

తలిదండ్రులిద్దరూ గతించిన పిదప అన్నయొక్క అభిరుచి, ఆశయాలకీ—తన అభిరుచి ఆశయాలకీ పొత్తు కుదరనందున, వెంటనే విభాగాలు చేసుకొని స్థిరచరాస్తులు అమాంబాపతులూ కలిసి శేషశాయీ, తన అన్నా చెరొక ఇరవై వేల రూపాయల కిమ్మతుగల ఆస్తిని పంచుకొన్నారు. ఇల్లు మాత్రం అంతా అన్న భాగానికే వదలి తాను విడిగా మరొక ఇల్లు కొత్తగా కట్టించుకొన్నాడు ఓమూడువేల రూపాయలతో.

అంత దోర్లాడి సంపాదించుకోం టేనేగాని జరగవన్న దిగులు లేదు. అదిగాక ఇంట్లో మట్టసమైన సంసారం—తనూ, సరోజినీ, ఓపదేళ్లకుర్రాడు రంగశాయీని. రంగశాయితర్వాత ఓఆడపిల్ల పుట్టి రెండేళ్లు పెరిగిందిగాని నష్టమైపోయింది పాప. మళ్లా సరోజిని నీళ్లుపోసుకోలే దింతవరకు. తండ్రి సంపాదించిపోయిన ఆస్తి ఎంతవున్నా — ఉద్యోగం పురుషలక్షణం గాబట్టి—ఊరికేకూర్చుని చేసే దేముంది—కానీ అంతగావస్తే చూతాంలే అని అనుకొని తనకంత ఇష్టం లేకపోయినా—కట్టినబోర్డు విప్పకుండా—జన్మస్థానమైన నెల్లూరులోనే రోజూ కోర్టుకుపోతూ వస్తూ ఉన్నాడు ప్రాంగ్న్యుడు నియోగి వంశంలో ప్రభవించిన మన శేషశాయి.

నిజంలో తన తెలివికీ, తన చదువుకీ, తన చాకచక్యానికీ నెలకు రెండువందల రూపాయల సంపాదన ఓలెఖలోది కాదు. రెండువందలు రొఖ్ఖంగా చేతికొచ్చి ఇంకా ఓవంద రూపాయలుదాకా వసూలు కావలసిన పద్దులు అకౌంటుమీద ఉంటే ఏంగాక - కాంగ్రెస్సనీ, సోషలిజమనీ, ఉపన్యాసాలనీ, హరిజనులనీ, యానాదులనీ - ఇట్లాంటి ఇతర వ్యాసంగాల్లో దిగకుండా నలుగురులాగా, తనూ అంగడిలో కోమటి గల్లా పెట్టినంటిపెట్టుకొని కూర్చున్నట్లు అంటిపెట్టుకొని నిలబడే ఉంటే ఈపాటికి లీడింగు అడ్వకేటు అని అనిపించుకోకపోయేవాడా? కాని చిన్నప్పటినుంచీ అతని మతమే వేరు - అబద్ధం సోకిన అలజడి తగిలితే ఆకేసు అట్లా అంటుకోడు - లక్షవచ్చుగాక - లక్షపోనుగాక. భగవంతుడిచ్చినదానిలోనే తృప్తి, ఆనందమూనూ.

అందువల్ల ఇంకా ముప్పైఅయిదు ఏళ్ళయినా పూర్తిగా నిండని పిన్నవయస్సు అయినప్పటికీ - ఇతనియొక్క విముఖత్వానికి తోడిప్లీడర్లల్లో కొంతమంది ఆశ్చర్య పడుతూ ఉన్నా, మరి కొంతమంది మాత్రం సంతోషిస్తూ, ఇతనిని ప్రోత్సాహపరుస్తూ, బారులో మట్టుకు తాము లీడర్లు అని అనిపించుకొంటున్నారు.

సోషలిజంమీద అఖండంగా చదివాడు శేషశాయి. తత్సంబంధమైన సాహిత్యవాహినిలో పడ్డాడంటే, నిద్రాహారా లక్కరలేకుండా ఎన్నిరాత్రింబగళ్ళయినా, వందలకొద్దీ మైళ్ళు అట్లా కొట్టుకొని పోతూనే ఉంటాడు. ఆ అలలమీద తాండవం చేస్తుంటాడు. ఎంత భోగభాగ్యాల్లో పొర్లాడుతూ ఉన్నప్పటికీ, నిత్యమూ తన అంతర్వీక్షణానికి గోచరమయ్యే భారతదేశ దారిద్ర్య విచ్ఛేదనానికి సోషలిజంతప్ప మరొక ఆయుధం పనిచేయదని దృఢవిశ్వాసం అతనిది: కాని ఇంత తీవ్రమైన సామ్యవాదికి ఇంత తీవ్రమైన అహింసాప్రేమ తత్వాలు పట్టుపడడం ఆశ్చర్యకరంగా ఉండకపోతుందా అని సందేహం.

తానెంతవిజ్ఞానవంతుడైతేమాత్రం ఏం-సరోజిని కాతని హృదయంలోని జ్యోతి దృగ్గోచరంగాలేదింకా. ఇంగ్లీషుచదువులేకపోయినా తెలుగులో చక్కనిపాండిత్యంమాత్రంకద్దు ఆమెకు. భార్యాభర్తలిరువురూ అఖండమైనప్రేమతో ఒండొకులను ప్రేమించుకొంటారు. అదిగాక ఈశ్వరసృష్టిలో ప్రతిమానవునికీ, ప్రతి జీవికీ - మృగానికీ పక్షికీ కూడా స్వేచ్ఛఉండి తీరాలనివాదించే శేషశాయి తనభార్యకుగూడా ఆమెకోరినస్వేచ్ఛ ఇవ్వడంలో ఆశ్చర్యంఏముంటుంది గనక! కాకపోయినా ఎంతస్వల్ప విషయాల్లోఅయినప్పటికీ - సంసారానికి సంబంధించిన విషయాల్లో ఆమెకత్తి కెదురుతగిలిందంటే ఓర్చుకొనే ఘటంగాదుఆమె. కొంచెం ముక్కుమీదకోపంఆమెకు. అందులోనూ మొదటినుంచీ ఇంట్లో అత్తగారి పోరూ, ఆడబిడ్డలపోరూ లేనిసంసారమేమో. ఆమె అవిచ్ఛిన్నంగా స్వరాజ్యంఏలుతోంది తనఇంట్లో.

అట్లాఅని ఓదూబరామనిషి కూడాకాదు పాపం. పొదుపుచెప్పొచ్చినపుడు ఆమెనుచెప్పి మరొకరిని చెప్పాలి: తనభర్త ఇంతస్వేచ్ఛ ఇచ్చాడుగదా అని ఈ కాలపువాళ్ళలాగ నెత్తినెక్కి తొక్కేరకమూగాదు: భర్తఅంటే పంచప్రాణాలుఇస్తుంది - అస్థులూ మాంసమూ అరిగిపోయేటట్టు చాకిరీచేసి భర్తను సుఖపెట్టుతుంది. కాని—

౫

ఆదినం ఆదివారం: కోర్టులేకపోబట్టి ఉదయాన్నేస్నానంఅయింతర్వాత కాఫీతీసుకొని, బయట తన ఆఫీసుగదిలో పడకకుర్చీలో పండుకొని శేషశాయి స్వరాజ్యపేపరు చదువుకొంటున్నాడు. ఆదివారం అయినందువల్ల గుమాస్తాగాని, పార్టీలుగాని అప్పటికింకారాలేదు.

తనగదికెదురుగానే వీధివసారా. తనుపడుకొన్నచోటునుండిచూస్తే వసారాలోవస్తూ పోతూఉన్నమనుష్యులు కనుపిస్తూనేవుంటారు. పేపరు చేతిలోకితీసుకొన్నదిలగాయతు వసారాలో ఉదయంనుంచీ సరోజిని చేస్తున్నకూరగాయలబేరాలు శేషశాయి నిశ్చలమైన దృష్టితో గమనిస్తూనేఉన్నాడు. చూచిన కొద్దీ తనలో తాను క్రుంగిపోతున్నాడు. తానుఅధిష్ఠించిన పడకకుర్చీ పాతాళంలోనికి పోతున్నట్టుగా అతనికితోచింది. పోనీ, ఆకూరగాయలబేరాల్లో తానుకలగచేసుకోరాదా అనిఅనుకొంటే, సరోజిని స్వాతంత్ర్యభంగానికిఓర్వదే! ఇదివరకొకటిరెండుసార్లు ఇట్లాగే "స్వల్పంలో బేరాలు చేయబోకు" అని సూక్ష్మంగా అనేవరకు "మీకు తెలియదు ఊరుకొండురూ.మీకెందుకీఆడంగిగొడవ"లని కసురుకొంది. అప్పటినుండీ తా నిట్టివిషయాల్లో చటుక్కునజోక్యంపుచ్చుకోవడానికి సందేహిస్తూఉంటాడు శేషశాయి. అదికాక అతనికోరికవేరు. తాను బీదలయెడల ఏవిధంగా కరుణాసముద్రుడయి, ఆపన్నులై వచ్చినవారికి లేదనకుండా సాయపడుతూ సంతోషిస్తూ ఉంటాడో అట్లాగే సరోజినికూడా—తానంతటతాను కరుణార్ద్రహృదయయై, బీదఃయెడ సానుభూతి,

కరుణ, దయగలిగి వర్తిస్తూ, లోకోపకారంచేస్తూ జీవించుతూ ఉండగా, తాను చూచి సంతోషించవలెనని అతని ఆశయం. కాని ఆభూతదయా, పశ్చాత్తాపము లోకరు నూరిపోస్తే అలవడే సుగుణములా! ఆ ప్రేమ, ఆ కరుణ సహజంగా లోపలినుండి పుట్టుకురావలె.

శేషశాయి కిదే దుఃఖం. ఎంతశ్రమపడినా తన భార్యమతములో మార్పుకలుగలేదు. మొగవాడు ఎన్నిటికనీ - కూరగాయలదగ్గర కూడా - భార్యను కాదని తాను కలుగచేసికొంటాడు. ఒకవేళ కలుగచేసుకొన్నా "ఆయన ధర్మరాజు - ఆబిడే గయ్యాళి." అని లోకు లనుకొంటారేమో అని అతని భయం

ఆ దినం జరిగిన చర్యలు సామాన్యంగా ప్రతి ఇంటా నిత్యమూ జరుగుతూనే ఉంటాయి లోకంలో. భాగ్యవంతులకీ, దరిద్రులకీగూడ పరిపాటి అయిపోయింది. అయినప్పటికీ తనభార్య ఆ విధంగా ప్రవర్తించగా చూచి శేషశాయిమనస్సు వ్యాకులపడింది. పేపరు చదవాలని ఒకటి రెండు పర్యాయములు ప్రయత్నించాడుగాని మనస్సు నిలకడ చిక్కలేదు. "ముక్కానిబేరం మూడుజాములయింది—" "అమ్మా బాలింతరాలిని - వీధినబడిపోవడానికి రవిక లేక సిగ్గవుతోంది" "అమ్మా అన్నం లేక పాలెండిపోయినవి. ఒక్కపిడచ అన్నం పెట్టమ్మా" — ఈ వాక్యా లే చెవుల్లో గింగురు మంటున్నవి అతనికి. తలచుకొనిన కొలదీ నిట్టూర్పులు అధికమవుతూ ఉన్నవి.

ఒకటి రెండుసార్లు లేచి, వీధివసారాలోనికి పోయి, ఒక పావుగంటసేపు అటూ ఇటూ పచార్లు చేశాడు.

"ఎందుకీ గృహస్థాశ్రమం - ఉత్కృష్టమైనది అంటారు గాని - గృహిణి ఇట్లాంటిదయినపుడు ఈ ఆశ్రమంయొక్క గొప్పతనం ఎట్లా గోచరిస్తుంది— అది ఉపయోగించుకొనే పద్ధతి తెలిసి ఉండాలి......"

మళ్లావచ్చి కుర్చీలో కూర్చున్నాడు. వీధిలో ఎక్కడ కూరగాయలవాళ్ల అరుపులు వినబడ్డా, అతడు ఉలిక్కిపడి, "గుండె దడదడమని కొట్టుకొంటోంది— ఎందుకో! ఈశ్వరా! నీ విలాసం" అని అనుకొంటూ, నిట్టూర్పు విడుస్తూ, పడక కుర్చీలోనే పరుండి ఉన్నాడు శేషశాయి.

౬

"పది గంటలయిందే సుబ్బీ: ఏంపనే నీది. ముందు లోపలిగదీ, సావిడీ తుడిచిరా: ఎబ్బే: వట్టి ఏబ్రాసిముండ లీ యానాది ముండలు."

"వస్తుండా నమ్మా! అయిపోయింది వస్తుండా. ఇయ్యేళ పనే జరగడం లేదమ్మా!"

"కానీ కానీ. కోర్టులేకపోయినా భోజనానికి పొద్దోతే అయ్యాఉండ లేరు ముందు నా కా బాణలి కడిగి ఇయ్యి."

"........................."

"తడిగుడ్డలు పిండి ఆరవేశావా?"

"వేస్తుండా నమ్మా."

"చూడు. పని అయింతర్వాత ఎద్దుతొక్కిన పేడతీసి, ఇవ్వేళ, పిడకలుచేసి మరీపో."

"....... ...."

యానాదిసుబ్బి సరోజిని దగ్గర పనికి కుదిరి ఆరు నెల్లయింది. ఏడో నెల జరుగుతోంది. సరోజిని కాపురానికి వచ్చిం తర్వాత ఇంతకాలం అతుక్కొని నిలిచిన యానాది ఈ సుబ్బి ఒకతే ఇంతవరకు. సరోజిని పెట్టేపోరూ, కష్టమూ పడలేక - వచ్చిన యానాదులు ఓ రెండు మూడు నెలలుండేవరకు నిభాయించుకోలేక వెళ్లడమూ జరుగుతోంది: కట్టుకోను గుడ్డలిస్తానని, రవికె లిస్తానని, అన్నం పెడతానని కొండంత ఆశలుపెట్టి పిలిచి ఏర్పాటు చేయడమూ, ఈమె రవ్వారట్టూ పడలేక వాళ్లు పారిపోతూఉంటే ఆ యానాదిదాన్ని పిలిపించి, చెడదిట్టి, దాని కదివరకే రవికేనా, ఏ గుడ్డయినా ఇచ్చిఉంటే దాన్ని మళ్లీ గూబలునులిపి తీసుకొని - ఇంట్లోపెట్టి - మళ్లీ రాబోయ్యే యానాదిదాని కివ్వడమూ - ఇట్లా జరుగుతోంది ఇంట్లో యానాదిదాని వ్యవహారం. సుబ్బి

కొంత పెద్దవరసలో మనిషి కాబట్టి పాపం మొదటినుంచీ వొళ్లువంచిపనిచేసుకొనిపోయ్యే అలవాటు కొద్దీ ఎవ్వరూ మెప్పించలేని సరోజిన్ని సుబ్బిమాత్రం మెప్పించి అంటిపెట్టుకొని, రోజూ అన్నంపెట్టే బదనాయం లేకపోయినా - నెల కారూ పాయిపావలా ఉద్యోగంతోనే తృప్తిపొంది కాలం గడుపుకొంటోంది పాపం.

ఉదయం సరిగా ౫త్తిగంట అయ్యేవరకువస్తుంది. పదిన్నరగంటదాకా పనిచేస్తుంది. ఇంటికిపోయి మళ్లా మధ్యాహ్నం 3 గంటలకల్లా వస్తుంది. సాయంత్రం ౬ గంటలవరకూ పనులుచేసిపోతుంది. చదువుకోక పోయినా, గంటలు తెలియకపోయినా - అలవాటు చొప్పునగాబోలు - పిడుగులుపడే వర్షంకురుస్తున్నా సరే, ఇంటికాడ తనపిల్లలకి జబ్బులుచేసి తలక్రిందులైనాసరే, ఎన్ని ఆటంకాలున్నాసరే, ఉదయం ౫త్తిటంగున కాగానే సుబ్బి తనడ్యూటీకి హాజరు కావలసిందీ, తనపనిచేయవలసిందీని. తానువచ్చేటప్పటికి అసలు తలుపులింకా తెరవకుండా నిద్రమంచంమీదే ఉంటారు సరోజినీ శేషశాయిలు. బయటవాకిలి చిమ్ముతూండే సుబ్బిచేతిలోని పొరకకట్ట ధ్వనులతోనే తరచు శేషశాయికి మెలుకువరావడం. "దీనితస్సాగొయ్యా. ఏరోజుచూచినా, ఇది ఇంతకరక్టుగా వేళకెట్లా వస్తుందిరా. ఎంతతంటాలు పడ్డా పదకొండుగంటలకి మేం కోర్టుకు సరిగ్గా అందుకోలేమే" అని శేషశాయి ఆశ్చర్యపడుతూ నిద్రలేవడమూ, కాలకృత్యాలు తీర్చుకోవడమూ జరుగుతూఉంటుంది - ఇట్లా కంటి సంజ్ఞతోనే ఇంటిపనులన్నీ అతిజాగరూకతతోచేస్తూ ఉన్నప్పటికీ సరోజిని సుబ్బినిగూడా తరచు ఏవో వంకలు పెడుతూ ఇగ్గులాడిస్తూనేఉంటుంది. అయినా కడుపార పదిమందినిగన్న బిడ్డలతల్లిగాబట్టి తనజనాబుదారీ చక్కగా గ్రహించుకొని, మెలకువతోనూ, తెలివితేటలతోనూ చేసుకొంటూ కాలంగడుపుతోంది సుబ్బి:

పదన్నరగంట అయింది. రోజూ చేయవలసిన పనులన్నీ పూర్తిచేసుకొందిసుబ్బి. ఇంటికిపోతూ—

"అమ్మా"

"ఏమే"

"ఒక్కసారి బయటికి రా అమ్మా"

"ఏమే"

"నాలుగురోజులు కాస్తఇబ్బంది పడాలసొచ్చిందే."

"ఏమిటే: ఏవూరైనా పోతావాఏమిటి ?"

"నీవుగనక దయఉంచితే నీపుణ్యాన్న ఇంత అన్నంతింటాం."

"ఏంవచ్చింది ?"

"వరికోతలమ్మా"

"అయితే"

"పైరు పంటకొచ్చింది. కోతలుపట్టారు. కూలివాళ్లకోసరం రెడ్లు తిరుగుతున్నారమ్మా"

"అయితే ఇంటిపనులన్నీ విడిపించి వరికోతకు పోతానంటావాఏమిటి ఇప్పుడు ?"

"అమ్మా, రోజుకు శేరుబియ్యం, ఆరణాలు డబ్బులూ ఇస్తారమ్మా"

"ఇష్టంలేకపోతే మానుకొని లేచిపోరాదూ"

"పదిరోజులకల్లా కోతలయిపోతాయమ్మా. మళ్లా వరినాటురోజులు. ఇంకా అయిదారు నెల్లదాకా అదానుతల్లీ"

"ఉద్ధరిస్తావు"

"ఏమో: పిల్లలూ మేమూ ఇంతబతుకుతాం. అదునుతప్పితే మళ్లావచ్చేదిగాదుగదా అమ్మా"

"అయితే ఇంటిపనులు నీతాత చేస్తాడనుకొన్నావా, నీముత్తాత చేస్తాడనుకొన్నావా ?"

"పిల్లని పంపిస్తానమ్మా"

"ఏపిల్లని ?"

"నాపిల్లనే"

"ఎవరు ? ఆబొడ్డూడనిలంజెనా. సడేలే: మాకు పిల్లావద్దు జెల్లావద్దు"

"................"

"నాకు ఇంట్లో పనిచేసేమనిషి లేకుంటే క్షణం జరగదు. మీయానాదివాళ్లకున్న రోగం యిదేగా. ఉన్నన్నాళ్లూ, ముండలు చేసతినేదిన్నీ, ఒంటికి పొగరెక్కింతర్వాత ఉడాయి చేదిన్నీ"

"నేనట్లాంటిదాన్ని గానమ్మా. ఒక్క పదిరోజులు గడువుకో తల్లీ. పోనీ జీతంపట్టుకోలే"

"జీతంపట్టుకుంటే పనులెట్లా జరగాలెనే."

"పిల్ల అన్నిపనులూ చేయగలదమ్మా- పోనీ రెండురోజులు చేయించుకొని చూడు. నీకు అంను బాటులేకుంటే అట్లాగే నేను వస్తాలే. పన్నెండు ఏళ్లుండయ్యమ్మా దానికి. మీదటికి దాన్నిగూడ కూలి పనికి పంపించాలని ఉండా."

"వల్లగాదు. ఉంటే నువ్వుండవలసింది, లేక పోతే మానుకోవలసింది."

"అట్లాగంటే ఎట్లాగమ్మా?"

"ఎట్లాగో నన్నడిగితే."

"మీ అన్నంతింటూ నిన్నడగకుంటే ఎవరినడి గేదమ్మా ఇక"

"పదిరోజులు కాదుగదా. పదినిమిషాలుగూడా నీకు శలవు ఇవ్వడానికి వీలులేదు ఇష్టమైతే ఉండు- కష్టమైతే వెళ్లు"

కొంచెంసేపు ఏమీ జవాబు చెప్పలేక ఊరు కొంది సుబ్బి. అలవాటయిన ఇల్లు- చటుక్కున చిన్న పిల్లలా వదులుకొని ఎట్లా లేచిపోగలదుపాపం.-

"పోనీలే అమ్మా. నీదయ. నీవు పొమ్మంటేనే పోతా. వద్దంటేపోనులే. కోప్పడబోకు. ఇంటికాడ మొగాడు నిన్నడిగెరమ్మంటే- పోనీ ఈపదిరోజులూ చెరొక పావలా డబ్బులూ సంపాదించుకొంటే పిల్లలకి దిగులుండదని అనుకొని అడిగాను తల్లీ. కోపగించుకోబోకు"

"లేదులే. మళ్లా పెండలాడేరా. మధ్యాహ్నం ఎద్దుకి ఉలవలువిసరాలి. నిమ్మకాయ ఊరగాయలోకి మిరపకాయలు దంచాలి. చాలాపనులున్నయి"

"వస్తాలే అమ్మా. ఒక్క బేడడబ్బులుంటే పారె య్యమ్మా, ఈ నెల జీతంలో పట్టుకొందువుగాని."

"డబ్బులా ?"

"ఒక్క బేడ ఇయ్యమ్మా. ఈ నెలజీతం - కొరవ రూపాయిబేడే యిద్దువుగానిలే. ఇంటికాడ కూటికి లేవు. మీ యానాదోడికి నిన్నరాత్రంతా జరంకాసిపోసింది. ఈ పొద్దు కూలికిపోలేదు. ఒక్క బేడ ఇస్తివా ఈ పూట రాగులు కొనుక్కొని ఇంతగంజి కాచిపోస్తాపిల్లలకి"

"నీకోసం నేనేం బేడలూ, మాడలూ మూట గట్టుకోలేదు, తెలుసునా. నీఉద్యోగానికితోడు అడ్వా న్సులు గూడానా? ఒకటోతేదీవస్తేగాని డబ్బులుమాట ఎత్తకు."

"అమ్మా! అమ్మా! రాత్రి ఇంటిల్లిపాదిమీ పస్తు పండుకొన్నాం. నీవుదయుఉంచకుంటే పిల్లలు చస్తారు"

"నన్నూరికే పడే పడే వాగించకే. పొయ్యిమీద కూర మాడిపోతోంది"

"అమ్మా, ఇవ్వేళ ఇంత అన్నమేనా వేశావు గాదు తల్లీ అంటల్లో"

"రాత్రి అన్నం మిగలందే ఏంచేయమంటావు. నీకోసం ప్రతిరోజూ సమారాధనలు జరపమంటావా ఏమిటి? అదిగాక నీకు రోజూ అన్నం పెట్టే ఏర్పాటు లేదే. నెలకు రూపాయి పావలాడబ్బులు మాత్రం ఇ చ్చేది ఖరారు. అన్నం మిగిలినరోజు పెడతా, లేనిరోజు లేదు. అన్నంబననాయం లేదుగా"

అంటూ సరోజిని వంటఇంట్లోకి పోయింది.

సుబ్బి—అన్నంకోసం రోజూ తెచ్చుకొంటూ ఉన్న ముంత- తెచ్చిన ముంత తెచ్చినట్టుగానే కుడి చేతపట్టుకొని ఎడంచేత్తో తలగోక్కుంటూ— ఇంటికిపోయింతర్వాత తన దృష్టిలో పడే దృశ్యం అక్కడనే దృగ్గోచరంకాగా-అడుగుసాగక-ఏమి చేయ డానికీ తోచక-ఒక్కక్షణం నిలబడి-నిట్టూర్పువిచ్చి ఇంకోరెండడుగులు ముందుకు బలవంతాన్నవేసి -దొ డ్డిలోనుండి పడమటితట్టు సందుగుండా వీధివాకిట్లోకి పోతూ - ఆఫీసుగదికాడికి వచ్చేవరకు - కిటికీగుండా

పంతులు శేషశాయి పడకకుర్చీశాయియై ఏదో చదువు కుంటూఉండగా చూచి, పోనీ తనబాధ పంతులుతో చెప్పుకొందునా అని అనుకొని రెండడుగులువేసేవరకు - "అమ్మయ్యో! అమ్మ బతకనియ్యదే- ఎప్పుడూ పంతులుతో నేను పలకనేలేదే - నావల్లగాదు-" అని నిస్పృహచెంది ఈ ప్రయత్నంలో పుట్టిన ఆవేదనతో గుండెకొట్టుకోవడంలో గలిగిన వేడివల్ల - అదివరకే ఏకాదశీవ్రతాచరణదీక్షలో నిస్సత్తువలైన తన అవయవములు మరింత పటుత్వంతప్పినందున బలహీనురాలై పదిమంది బిడ్డల్నికని ఏబయ్యోపడిలో వొడుడాకువలె రక్తమాంసాదు లెండిపోయి - ముడతలుపడిన చర్మంతోనూ, కట్టెవలె బిసుకున్న ఎముకలు కనుపించే దేహంతోనూ, తినిపారేసిన తాటిముంజెలోని కళ్ళవలె గుంటలుపడ్డ కళ్ళతోనూ, రాచుకొను చమురు లేనందున తైలలేపనముగాని, స్నానసౌభాగ్యముగాని నెలలతరబడిగా ఎరగనందువల్ల అట్టకట్టిన తలవెంట్రుకల చుట్టతోనూ చూసేవాళ్ళకి దరిద్రదేవతవలె ప్రకాశిస్తూ- అదొక విధమైనస్థితిలో ప్రాణాలు ఉగ్గబట్టి - పంచభూతాత్మకమైన తనదేహాన్ని బలవంతాన్నపీడినబడి ఈడ్చుకొంటూ, ఈడ్చుకొంటూ సుబ్బి నాలుగుఫర్లాంగులదూరంలో ఉన్న తనగుడిశకాడికి ఒక అరగంటసేపటికి ఘటంచేరవేసింది.

౨

అతనిబాధ అతనిది: శేషశాయి కీగొడవ ఏమీ తెలియదు పాపం: ఉదయం తాను చూచిన దృశ్యమే చిత్తములో హత్తుకోగా - తన్మూలాన్న గలిగిన విచారంవల్ల ఓగంటాగంటన్నరసేపు దుఃఖించి.-

"దుఃఖించి ఉపయోగం లేదు, అజ్ఞానంవల్లనే సరోజిని ఇట్లా ప్రవర్తిస్తోంది. కాని ఆమెకు దయలేక పోలేదు. డబ్బంటే కాపీన్నమూ లేదు: లోభిత్వమూ లేదు: ఆమెకు డబ్బును సద్వినియోగం చేయడంమాత్రం తెలియదు: నేను హరిజననిధికి వందరూపాయలు ఇచ్చినపుడు తాను సంతోషించిందిగాని విచారించలేదే: హరిజనహాస్టలుకు ఏభయి రూపాయిలు ఇచ్చినప్పుడు గూడ సంతోషించిందే: శారదానికేతనానికి రెండు వందలిచ్చినపుడు సమ్మతించిందే - ఇట్లాటివి ఎన్ని -. మొన్న సంక్రాంతిపండుగకు హరిజనుల పిల్లకాయలకు గుడ్డలుకుట్టించినపుడు తాను స్వయంగా తన చేతులతో పంచిపెట్టింది. ఇట్లా నేచేసే సద్వినియోగాలకు ఆమె ఎప్పుడూ నాకు అడ్డు రాలేదు: కాని - ఎటువచ్చీ - తన ఇంటివిషయాల్లోమట్టుకు ఆమె స్వాతంత్ర్యంకోరుతుంది: ఆ పెట్టుపోతల్లో నన్నుకలిగించుకోనివ్వదు: తనకింతస్వతంత్రం ఉన్నందుకు-ఈ స్వల్పవిషయాల్లో రవంత ఉదారగుణమేఉంటే -నాకెంత ఆనందంగా ఉండును! కానీలే: ఈశ్వరుని దయవుంటే - ఆమె ఈదుర్గుణాల్ని విడిపించుకోగలదు:"

అని కొంతప్రయత్నంమీద ఊరటకల్పించుకొని నిట్టూర్పువిడిచి - మరల పేపరు చదువుకొంటూ కుర్చీలోనే కూర్చొని ఉన్నాడు శేషశాయి. ఈలోపల గుమస్తా ఓసారివచ్చి ఏవోకొన్నికాగితాలమీద సంతకం చేయించుకొని వెళ్ళిపోయాడు.

ఇంట్లోవున్న శేషశాయికే సుబ్బిబాధ తెలియనప్పుడు ఇక వీధిలోవారికి తెలియక పోవడంలో ఆశ్చర్యం ఏముంటుంది?

వంట అయిందని సరోజిని చెప్పడంతోనే శేషశాయిలేచి భోజనంచేసి, తాంబూలంవేసుకొని ఎండవేళ కాస్సేపు నిద్రపోయాడు. నిద్రలేచింతర్వాత ఏవో కొన్ని జాబులు పోస్టుకుపోవలసినవి వ్రాసుకొంటూ ఆఫీసుగదిలో కూర్చున్నాడు. మూడుగంటలయేవరకు 'ఫలహారంచేతురుగాని రమ్మ'ని సరోజిని పిలిచింది. ఒకే నని లేచి పడమటిసందుగుండా దొడ్లోకి కాలుముడుచుకోను పోయేవరకు, ఉత్తరపుతట్టు వసారాలో ఎప్పుడు వచ్చిందో సుబ్బివచ్చి క్రింద గోతంపరుచుకొని, దానిమీద తిరగలిపెట్టుకొని వసారాగోడ కోఅడుగుదూరంలో దక్షిణపుముఖంగాకూచుని, ఎడంకాలు ముడుచుకొని, కుడికాలు సాచుకొని ఎక్కుపెట్టిన ఉండీలుబద్దవలె ముందరికి వంగిపోయిన నడుముతో, ముందుకీ వెనక్కీ ఊగిసలాడుతూ, ఉలవలు విసురుతూ కూర్చుంది. "అరే! ఇంతకరకష్టగా ఇది డ్యూటీకి తప్పకుండా

వచ్చిందే" అని మనస్సులో ఆశ్చర్యము కలుగగా, ఒక్కక్షణం నిదానించి చూచేవరకు తిరగలిపైరాయి కొంతకష్టంమీద తిప్పుతూ ఉన్నట్టు అతని మనస్సుకు తట్టింది. అవశిష్టంతీర్చుకొని, బావిదగ్గర కాళ్లూచేతులూ ప్రక్షాళన చేసుకొని పైతువాలుతో చేతులు తుడుచుకొంటూ వంటయింటిగడపఎక్కి లోపలికి పోతూ ఉండగా సరోజిని అప్పుడే ఇల్లు చిమ్మి పీటవేయబోతూంది.

"ఇప్పటికి రెండుమూడు నెలల్నుంచి చూస్తున్నాను. ఎప్పుడు చూచినా సుబ్బి ఆ గుడ్డేకట్టుకొని ఉంటుంది. పాపం దానికి కట్టుకోను రెండోగుడ్డ లేదు గాబోలు. దాన్ని చూస్తే నాకు దుఃఖంవస్తోంది. పాత చీరెల్లో ఏదో ఓగుడ్డ దాని మొఖాన్ని పారెయ్యకూడదటే"

"........................"

"అబ్బ ! ఈ దారిద్ర్యదుఃఖం చూడలేకుండా ఉన్నాను. కళ్ళుబడకపోయినా బాగుండును ఈ అవతారాలు. మళ్లా దానిచేతనే, ఆ మురికిగుడ్డలతోనే ఇంటికి పాలూ, పెరుగూ, కూరలూ అన్నీ తెప్పిస్తావు. అబ్బ! అసహ్యాం అవుతోంది."

"................ ...."

"ఏదో పాతచీర ఒకటిచూచి దానికిద్దూ. నేనీ దుఃఖం చూడలేకుండా ఉన్నాను."

"వచ్చికూచుందురూ. దోశెలు చల్లారితే బాగుండవు."

"దానికో పాతచీర ఇస్తేనేగాని నాకేమీ సహించదు."

"ఇది మరీబాగుంది. తలచినపుడే తాత పెళ్ళిలా ఉంది."

"దీనికేమైనా లగ్నం కుదరాలా ఏమిటి ?"

"అయితే మీ ఇష్టంవచ్చినట్టు చేసుకోండి. నన్నడగడ మెందుకు? మీకు తెలియని చీర లేమున్నై. మీరే తీసి యిచ్చుకోండి. పాతదో, కొత్తదో నాకు తెలియదు."

"అంతేగాని నీవుమాత్రం నీచేత్తో యివ్వలేవన్నమాట."

"ఇప్పుడంత తొందరేమి వచ్చిందండీ? మొన్న నే- ఆరునెల్ల యింది - రాయివంటి చీర ఇచ్చాను. మళ్లా ఇంతలోనే ఇంకొకటా ? దానికి లేకపోయినా మీకెందుకీ అనవసరపు గొడవలూ?"

అని ఏమేమో చెప్పబోయేవరకు వీధిలోనుండి

"శేషశాయీ"

"ఎవరువారు ?"

"ఏంచేస్తున్నావోయ్"

"వస్తున్నా. రా, లోపలికిరా. ఇట్లా వచ్చి సావిట్లో కూర్చో."

అనేవరకు తోడి అడ్వకేటు శ్యామలరావు చంకన టెన్నిసుబాటు పెట్టుకొని సావిట్లోకి వచ్చి కుర్చీలో కూచున్నాడు. సమయానికి వచ్చిన స్నేహితునికి భార్యాభర్తల తగవులు తెలియగూడదని - సరోజిని ఇచ్చిన జవాబులవల్ల లోపల కుతకుతలాడే హృదయాగ్నిని తెచ్చిపెట్టుకొన్న ముఖవిలాసంతో మరుగుపరుస్తూ, శేషశాయి శ్యామలరావుప్రక్కనే కుర్చీలో కూచుని మాట్లాడుతూ ఉన్నాడు. ఇంతలో వీధిలోని ఆటలు చాలించి "అమ్మా! తినడానికే" అంటూ రంగశాయి వంటఇంట్లోకి పరుగుపెట్టేవరకు "పెడతానుండు" అని రెండుప్లేట్లల్లో ఫలహారాలు పెట్టి శేషశాయికీ, శ్యామలరావుకూ చెరొక ప్లేటూ ఇచ్చిరమ్మని లోపలినుండి సరోజిని రంగశాయిని పంపింది.

"ఇప్పుడేఇంటిదగ్గరతినివచ్చాను;ఆకలిలే"దంటూ విసుగుతోనే శ్యామలరావు బల్లవంతాన్న లోపలికెక్కిస్తున్నాడు ప్లేటులోఫలహారాన్ని. కడుపులోనూ మనస్సులోనూ బాగులేనందున శేషశాయిమాత్రం కొంచెం ఎంగిలిచేసి, సగంపైగానే ప్లేటులో దిగబెట్టాడు. టీతీసుకొని ..

"ఇవ్వేళ క్లబ్బులో పాటకచ్చేరికి వస్తావా శేషశాయి?"

"ఆహా: "

"తప్పకరా: చాలాగొప్పపాట. "

"ఎన్ని గంటలకేమిటీ? "

"ఎట్లాలేదన్నా ఆరవుతుందిలే: ఆదివారం కాబట్టి నేనుముందుగాపోతేనేగాని టెన్నిసుసెట్టు దొరకదు: నేనువెళ్ళుతా. క్లబ్బులోకలుసుకొందాం" అంటూ శ్యామలరావు వెళ్లిపోయినాడు.

అతడెందుకువచ్చిందీ శేషశాయికి అర్థంకాలేదు: వెళ్లేదారిగాబట్టి, ఇరుగుపొరుగు కాపురంగాబట్టి పోతూపోతూ ఇట్లా తొంగిచూడ్డానికి వచ్చాడుగాబోలునని అనుకొని-"ఎందుకో ఓఅందుకులే. దీనికింత ఆలోచనయేల? ఎందుకొరకైనా సమయానికి కందుకొన్నాడు." అని అనుకొంటూ, సరోజినిసంభావణవల్ల గలిగినరిచ్చపాటు దశలోనే ఇంకాస్వస్థత లేకుండా ఉన్నాడు. ఇంతలో

"యేమండోయ్: ఇట్లారండి: ఇట్లారండి - తొందరగారావాలి: అయ్యయ్యో:"

"..................."

"అయ్యయ్యో : తొందరగారాండీ: రావాలి రావాలి. "

"ఏమి ?"

"ఏమిటండీ. సుబ్బివిసురుతూ విసురుతూ ఇట్లా విరుచుకొని కిందికిఒరిగిపోయింది? ఇట్లా పడిపోయిందేమిటండీ? పిలిస్తేపలకడంలేదు. "

"అయ్యో పాపం! ఇట్లా పడిపోయిందే"

"ఏమిటో! ఇప్పుడు చూశానండీ. విసురుతూనే ఉంది"

"దీనికేమైనా జబ్బుందా ఏమిటి?"

"అబ్బే లేదండీ! ఏడు నెలలుగా చూస్తున్నాను: ఎప్పుడూ ఇది ఇట్లా పడిపోలేదు. అయ్యో పాపం! ఎట్లాగండీ ఇప్పుడు"

"డాక్టరును పిలుచుకొని వస్తానుండు"

"పిలిపించండి పాపం. చూడండీ, ముందు దాని మొగుడికి చెప్పి పంపండి. కాస్త పట్టుకోనైనా పట్టుకొంటాడు—"

"నే పట్టుకుంటాలే"

"మీరు వద్దు. వాణ్ణి పిలిపిస్తురూ—అన్నట్టు మరిచిపోయాను. దీని మొగుడికిగూడా నిన్నరాత్రి జ్వరం వచ్చి పడివున్నాడని చెప్పిందండి పాపం. అయ్యో: ఎట్లాగండీ"

"అయ్యో" అంటూ శేషశాయి సుబ్బికి సమీపంలోకి పోయి కూచున్నాడు. సుబ్బి కుడిచేతిని బలవంతాన ఎత్తి నోటిదగ్గర పెట్టుకొని "దాహ. దాహం" అని అర్థం అయ్యేటట్టు సంజ్ఞ చేసింది.

"మంచినీళ్లు కావాలట. కాసినినీళ్లు తీసుకురా"

"అయ్యో పాపం! శోషవచ్చింది కాబోలునండీ. నిన్నటినుంచీ అన్నంలేదట పొద్దున చెప్పిందండీ పాపం. అడిగినపుడు బేడసబ్బులయినా పారేశానుగాను. పొద్దున్న అంట్లల్లో అన్నంగూడ మిగలలేదు ఇవ్వేళ. ఈపూట గూడ గంజిలేకుండా వచ్చింది గాబోలు సన్నాసిముండ: చెప్పగూడదూ, పోనీ: ఏమీ చెప్పకుండా వచ్చి తిరగలి ముందేసుకొని కూర్చుంది"

"నీచదువు తర్వాత చదవొచ్చులే. ముందు ఇన్ని నీళ్లు తీసుకొచ్చి గొంతులోపోయి"

"చన్నీళ్లా, వేన్నీళ్లా"

"గోరువెచ్చని నీళ్లయితే మంచిదే"

"తెస్తాగాని ముందు ఈలోటాలో చల్లనినీళ్లు దాని మొఖాన్న కొట్టండి. కొంత తెప్పిరిల్లుకుంటుంది."

" అయ్యో: మళ్లీ చూపుతోందే, దాహమట — తొందరగా నీళ్లు తే —. "

. లోటాతో సరోజిని నీళ్లు తెచ్చేవరకు— సుబ్బి నోరు తెరవగా— శేషశాయి గొంతులో ఓ గుక్కెడు నీళ్లు పోశాడు — నోట్లోపోసిన రెండునిమిషాలవరకూ నీళ్లు గొంతుదిగలేదు. క్రమ క్రమంగా—ఒక్కొక్క.

చుక్క దిగమింగుతూ ఆ సుక్కుడునీళ్లూ—అయిదు నిమిషాలకు మింగింది—.

"చూడు—ఇక వట్టినీళ్లువద్దుగాని — కాసిని చిట్టుకునీళ్లు తయారుచెయ్యి — నేను పోయి దీని మగనికైనా, కొడుకునయినా పిలుచుకొనివస్తా" నని సుబ్బిని సరోజినికప్పగించి, శేషశాయి పరుగున సుబ్బి సంసారం ఉండే గుడిశకాడికి పోయినాడు.

౨

శేషశాయిఇంటికి వాయవ్యమూలగా, రోడ్డుకు పడమటగా ఉంది సుబ్బిగుడిశ— నాలుగు ఫర్లాంగులుంటుంది దూరం.— ఆ గుడిశ అట్లా ఆపక్కగా ఉందని అనుకోవడమే గాని శేషశాయి ఎప్పుడైనా వాళ్ల గుడిశకాడికి వెళ్లాడా, చేశాడా.

అక్కడ సుబ్బిగుడిశ ఒక్కటే గాక ఇంకా ఏడుగుడిశలున్నై. ఏగుడిశకాడికిపోతే సుబ్బిసంసారం కనుపిస్తుందో తెలియకపోయెను శేషశాయికి: అన్నీ గుడిశలూ. చుట్టు గుడిశలే. ఒక్క అనుగు ఎత్తునగా బోలు మట్టిగోడపెట్టి, దానిమీద తాటిఆకులూ, చిరిగిపోయిన ఈతచాపలూ కప్పి అమర్చబడి ఉన్నవి. మనిషి కూర్చుని దేకుతూ లోపలికిపోగల సందుమాత్రం ఉంది— ముఖద్వారం. మిగిలిన యానాదులందరూ పనులకు పోబట్టిగాబోలు ఆ గుడిశల్లో ఎక్కడా శబ్దంలేకుండా—ఈతాకుతడికలతో మూయబడిన ముఖద్వారములు గలవై— గుడిశలన్నీ నిశ్శబ్దంగా ఉన్నవి. ఒక్క సుబ్బిగుడిశకాడ మాత్రం సందడిగా ఉంది. సుబ్బిపిల్లలు—అప్పుడప్పుడు తల్లితో శేషశాయిఇంటికివస్తూపోతూఉన్న వాళ్లయినప్పటికీ— ఎందువల్లనో శేషశాయికి వాళ్లు గుర్తు చిక్కలేదు.

ఈయన పోయేవరకూ సుబ్బిపిల్లలు—నలుగురు ఆడపిల్లలు, అయిదుగురు మొగపిల్లలూ— గుడిశకాడ బయట గలభాచేస్తున్నారు. ముసలాడు - తండ్రి గుడిశలో కాళ్లుచాచుకొని క్రిందనే తలకింద ఇటుకరాళ్లు ఎత్తుపెట్టుకొని వెల్లికిలాపండుకొని ఊఁ, ఊఁ, ఊఁ అని మూలుగుతున్నాడు. శేషశాయి వచ్చినసంగతి బయట పిల్లలెవ్వరూ గమనించలేదింకా. సుబ్బి పెద్దకొడుకు సుబ్బరాముడు ౧౩ ఏళ్లవాడు ఓగోచీపెట్టుకొని సదుంగా కూర్చున్నాడు. వాడిచుట్టూ మిగిలినపిల్లలందరూ—కూచునికొంతమంది—నుంచొనికొంతమంది—గంతులేస్తూ కొంతమంది— మారాములు చేస్తున్నారు. సుబ్బరాముడికీ వాడిచెల్లెళ్లకిద్దరికీ గుడ్డలన్నీ తడిసిపోయి ఒళ్లంతా బురద అంటుకొని ఎండిపోయి నల్లగా, బురదలో పొర్లివచ్చిన వరాహపోతరాల్లాగా ఉన్నారు.

సుబ్బరాముడు తనముందొక కుండబొచ్చెపెట్టుకొని మిగిలినవాళ్లు మారాములు చేస్తూ ఉంటే వాళ్లని నయాన్నో, భయాన్నో సమాధానపెడుతూ ఎవ్వరికీ లోపం లేకుండా పంచిపెట్టుతున్నాడు; కాని తనకంటె చిన్నవాళ్లయినప్పటికీ-ఒకరిద్దరు ఆఘాయిత్యపు పిల్లలు సుబ్బరాముడిమీద కెగబడి, బొచ్చెలోనిది బలవంతంగా తీసి పెరుక్కొని దూరంగా పారిపోయి మామిడిచెట్టుకింద నిలుచుకొని ఆత్రంతో గతుక్కొంటూ నోట్లో పెట్టుకొంటున్నారు. "ఈ పాలిరా నిధరా చెపతాలే. అమ్మకీ అయ్యకీ మిగలపవిలే అంతా మీ పొట్టనే పెట్టుకొంటే" అంటూ సుబ్బరాముడు చేయి జారిపోయిన వస్తువును గురించి తమ్ముల దుండగానికి ఆక్రోశపడుతున్నాడు. మరికొంతమంది అన్న ఇచ్చిన దాంతోనే తృప్తిపడి మంచితనంగానే అన్నను చెల్లించుకొని తీసుకొని తింటున్నారు. పిల్లల్లోకల్లా ఎనకిల్లినాడు - శేషుడు గాబోలు - నాలుగేళ్లకుంక - ఈమధ్య ఆడుకోవటంలో ఎక్కడనుంచో కాలుజారిపడి, ఎడంకాలుతొడలో విరిగినందున వచ్చినంత జబ్బుచేసి చికిత్స చేసేవాళ్లులేక పోయినకాలు రానందున దేకుకొంటూనే త్రొక్కుళ్లాడుతున్న ఆ సంఘంలో ఎట్లాగో దూరి అన్నమీద కెగబడ్డాడు. ప్రాణంమీదికొచ్చి తిరిగి జన్మ ఎత్తినట్ల జబ్బుచేసినందువల్ల శేషడికి బలహీనంవల్ల ఊపిరపొట్ట పెరిగి కాళ్లూచేతులూ సన్నగిలి చూచేవాళ్లకి వీడెట్లా బతుకుతాడా అని అనిపించేటట్టున్నాడు పాపం. వాణ్ణి చూడంగనే సుబ్బరాముడికి దయగలిగి ఉన్నవాటిలో లేతవి మంచివిగా రెండు ఏరి బురదదులిపి "ఇయిగో

తిను" అని చేతిలో పెట్టాడు. మిగిలినవాళ్లు చేతికందేనవి తొందరగా నోట్లోవేసుకొంటే అన్న మళ్లా ఇస్తాడని ఆశతో చేతిలోనివి తొందర తొందరగా బురదా బాడీ అనకుండానే నోట్లోవేసుకొని కసుకసుకసుకసూ నమిలి మింగుతున్నారు.

ఈచర్యలన్నీ గమనిస్తూనే శేషశాయి ఈ గుంపును సమీపించాడు. శేషశాయిని చూచి సుబ్బరాముడు వాని చెల్లెళ్లిద్దరూ కొంత జ్ఞానంకలిగిన ఈడు వచ్చినవాళ్లు కాబట్టి లేచి నిలబడ్డారు. మిగిలిన కుర్రకుంకలు గంతులేస్తూనే చేతిలోనివి తింటున్నారు. "ఒరే ఆబొచ్చెలోనివి ఏమిటిరా" అని శేషశాయి సుబ్బరాముడిని అడిగి, అడుగుతూనే పిల్లకాయల చేతుల్లో వున్నవాటిమీదికి అప్రయత్నంగా తన దృష్టిపోగా అవి పచ్చికప్పలు, పచ్చిచేపలు, పచ్చిఎండ్రకాయలుగా వెంటనే తెలుసుకొని ఆదృశ్యం చూడ్డంతోనే తనకు గలిగినవికారానికి వాంతిఅవుతుందేమోనని భయపడి ఓక్షణంకళ్లుమూసుకొని "సర్వేశ్వరా! ఈ దినం దుర్దినం నాజన్మలో" అని అనుకొని కళ్లు తెరచేవరకు సుబ్బరాముడు బొచ్చెను చాటున దూరంగా దాచి పిల్లకాయల్ని బయటికి సాగనంపి గుడిశకాడికి పోయి "అయ్యోయ్ పంతులు వచ్చిండు" అని గుడిశలో ప్రాయోపవేశదీక్షలో పరుండిఉన్న తండ్రితో చెప్పినాడు.

"ఒరే! మీనాయన కెట్లాగుందిరా"

"మొన్న రేతిరినుంచి బువ్వ లేదండి. ఈ పొద్దంతా జరం తగిలిందండి. అయ్యా, బయటికి రావే ఓపాలి! పంతులు వచ్చిండు"

"నీకు జ్వరంగావుంటే నీవురావద్దులే, పండుకో. నీకు మందు పంపుతాలే. ఒరే! నీపేరేమిటిరా"

"నా పేరు సుబ్బరాముడండి"

"ఒరే సుబ్బరామా! నీతో పని ఉంది, ఇంటిదాకా రా"

అని శేషశాయి అనేవరకు 'వస్తుండా' అని సుబ్బరాముడు దాచిపెట్టిన బొచ్చెమీద తాటాకుకప్పి పైన రాయి బరువుపెట్టి శేషశాయితో గూడ వెనకనే పోయాడు.

"ఇవ్వేళ మీరు కూడు తినలేదురా" సుబ్బరామా!"

"లేదు బాబు! గింజలు లేవు. మాఅయ్య పని చెడ్డప్పటినుంచీ కూలికి పొయ్యేవాళ్లు లేక నిన్నా మొన్నా గింజలు చిక్కలేదు. నేను కోతకు కూలికి పోతానంటే ఇంటికాడ అయ్యకు బాగులేదని నన్నీడ ఉండమనిచెప్పి మా అమ్మ మీయింటికి వచ్చింది. పోనీ మా అమ్మయినా ఈ నాలుగురోజులు వరికోతకు పోనా లనుకొంటే ఇంటికాడ అమ్మగోరు శలవివ్వడంలే దన్నారట"

"మరి నిన్నటినుంచీ ఏంతిన్నారురా మీరు?"

"అయ్యేనండి! ఆ పచ్చివే! నాలుగు తెచ్చుకొని తిన్నాం. మా అమ్మకి నిన్నటినుంచీ అవిగూడా లేవండి"

"మరి మీ అమ్మకెందు కివ్వలేదురా?"

"మా అమ్మ పచ్చివి తినదండి. పోనీ కాల్చుకొనేనా తింటుందని నిన్నమధ్యాహ్నం నాలుగు వేరేతీసి దాచిపెట్టితే ఎవ్వరూ చూడకుండా కుక్కవచ్చి మింగేసిందండి. మా అమ్మ నిన్నటినుంచీ పస్తేనండి— ''

"అట్లాగురా పాపం. చూడు, మీఅమ్మ కిందాక మాయింటికాడ జబ్బుచేసి పడిపోయిందిరా. ఇదిగో - అట్లా దొడ్లోకిపోయిచూడు -" అని అప్పుడే ఇంటికి చేరుకొన్న శేషశాయి సుబ్బరాముడిని సందుగుండా దొడ్లోకి పంపి తాను లోపలినుంచి వెళ్లాడు. అప్పుడే చిట్టుడుకునీళ్లు తయారుఅయినందున గిన్నెలోపోసుకొని సరోజిని సుబ్బిదగ్గర తెచ్చిపెట్టింది. వాటిని సుబ్బరాముడు సుబ్బిగొంతులోపోసి ఓఅరగంటకి సుబ్బి తేరుకొని కళ్లువిప్పి కాస్తలేచి కూచున్నతర్వాత

"ఒరే: ఇవ్వేళకు పని చాలుగాని మీ అమ్మనింటికి తీసుకొనిపోరా సుబ్బరామా: ఇదిగో ఈ రెండు రూపాయలూ తీసుకొనిపోయి గింజలు తెచ్చుకొని తినండి. తర్వాత చూద్దాం'' అని శేషశాయి.

సుబ్బరాముడి చేతిలో పెట్టేవరకు మేరువుపర్వతం దొరికినట్లు, కష్టాలుగట్టెక్కినట్లు సంతోషిస్తూ సుబ్బరాముడు తల్లిని రెట్టపట్టుకొని, తిన్నగా నడిపించుకొంటూ ఇంటికి తీసుకొనిపోయాడు.

"చేతి కెంతవస్తే అంతే. ముందూ వెనుకా ఆలోచనలేదు. ఒక్కసారే రెండురూపాయలు లిస్తారా ఎక్కడనైనా. అంతా బడాయి" అని సణుగుకొంటూ సరోజిని లోపలికి వెళ్లిపోయింది.

౯

సాయంత్రం అయినా, అయిదున్నరగంటలయినప్పటికీ పాటకచ్చేరిసంగతి మరచిపోయి శేషశాయి ఒకతువానులోబడి ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. కాలుకాలిన పిల్లిలాగా ఒక అరగంటసేపు ఇంట్లోనే అటూఇటూ తిరిగి గుమాస్తాను పిలిపించి డాక్టరు దగ్గరనుండి మందుతెప్పించి సుబ్బిమగనికిపంపి అప్పుడే పొద్దుగూకినందున కాస్త కాలుసాగడంకోసం పెన్నానదివైపు షికారుకుపోయి అవసరాలుతీర్చుకొని చీకటిపడి ఏడు గంటల కింటికి వచ్చి పైఉత్తరీయం కొయ్యకుతగిలించి చొక్కావిడిచి తుండుగుడ్డ భుజంమీదవేసుకొని ఏమీతోచనందున పడకగదిలో పరుపుమీద పండుకొన్నాడు.

సరోజిని లోపలవంటచేస్తూ పొయ్యిమీద పెట్టిన బాణలిలోని వేపుడుకూరలోని పోపులతోనూ, కట్టుచారులో పెట్టిన తిరగ మోతలతోనూ, చుంయ్యి చుంయ్యమనే ధ్వనులుపుట్టిస్తూ, కూరలు వేయించినపుడు చేతిలోగరిట బాణలికి తగిలినందువల్ల కలిగినశబ్దములతోనూ, నీళ్లబిందెలో చెంబుముంచినపుడు కలిగే శబ్దములతోనూ వంటఇల్లే గాకుండా ఇల్లంతా కోలాహలంచేస్తూంది. పొయ్యిమీదబాణలి కిందకి దింపవలసి వచ్చినపుడు కాబోలు చేతిలోపడ్డజారి చేయీ, బాణలీ కలుసుకొన్న సంపర్కంవల్ల పాపం సరోజినికి చెయ్యి చుర్రుమనేవరకు "అబ్బబ్బ దీనిమొఖం తగల బెట్టా" అని ఎవరినో, ఎందుకో తిట్టి, ఖంగుమని పెద్దశబ్దంఅయేటట్టుగా బాణలిని వంటయింట్లో గచ్చుమీదపడేసింది. చెదిరి కిందపడిపోయిన కూరముక్కలని ఏరి మళ్లీ బాణలిలో వేస్తూఉండగా ఇంతలో "అమ్మా: అన్నమే" అని రంగశాయి వచ్చి తొందరచేసేవరకు "ఉండరా: చస్తూఉంటేను. ఇంకా పొద్దు గూకలేదు: కాస్తనిలు" అ కడుపారని కన్న కొడుకయినప్పటికి సరోజిని కసురుకొంది. ఉర్లగడ్డ వేపుడుచేసి చారుకాచి మినుమువేసి చింతపండు పచ్చడిచేసి పుల్లటి పెరుగుంటే కాస్త అల్లం వేసి పచ్చడికసి పొద్దుపోతే నిద్రపోతాడని రంగశాయిని పిలిచి అన్నంపెట్టి నిద్రపుచ్చి గంట చూసుకొనేవరకు ఎనిమిది దాటింది.

"ఏమండీ. లేవరాదూ. పొద్దోయింది."

"........................."

"........................."

"........................."

"పెందలాడ్డే లేతురూ. మీపుణ్యాన్ని ఇంత తిని నడుం వాలుస్తాను."

"........................."

"అబ్బా: ఇవ్వేళ దాసిముండ విరుచుకొనిపడిపోయి ఇంటిపనిఅంతా నాకు అప్పగించి మరీ పోయింది దానిమొఖంమండా."

"........................."

"ఏమండీ: మిమ్మల్నే. నాకు కాళ్ళూ, చేతులూ స్వాధీనంలేవండీ: అన్నం చల్లారిపోతూంది. నాలుగు మెతుకులు వేసుకొంటేనేగాని. నాకు ప్రాణాలు నిలిచేటట్టులేవు."

"........................."

"తొందరగాలేచి అన్నంతిని మరీ పడుకొందురూ"

"........................."

"........................."

"........................."

"ఎన్నిసార్లు పిలిచినా పలకనే పలకరేమండీ; బడాయా ఏమిటి? చస్తూఉంటే మీకు ఊరికే వేళాకోళం."

"........................."

"ఏమిటి? నిద్రేనా ఏమిటి? అన్నం తినకుండా నిద్రేమిటండీ - చిన్న పిల్లాడిలాగ" అంటూ లేచి సరోజిని శేషశాయిపరున్న మంచం దగ్గరకు వచ్చింది. బెడ్ రూములైటుకు తలుపు అడ్డం వచ్చి శేషశాయి మొఖానకి చీకటిఅయింది. దగ్గరకు వచ్చి తట్టి పలకరించింది. శేషశాయి పలకలేదు. మీదచేయివేసి ఇటూఇటూకదిపి పలకరించింది: నిద్రపోతూ ఉన్నవాళ్ళని లేపడం సులభంగాని మేలుకొని ఉన్నవాళ్ళను లేపడం కష్టంగా! ప్రణయ కోపమేమోనని అనుకొని చీకటిలోవున్న శేషశాయి ముఖానికి తన ముఖం దగ్గరగా పెట్టి - ముందుకువంగి శేషశాయికి కిచకిచలు పెట్టింది అవీ పనిచేయలేదు: 'ఏమిటండీ: ఇట్లాపంతుకొన్నారు." అని గడ్డంపుచ్చుకొని ఆ పక్కగా ఒత్తిగిలి పండుకొనిఉన్న శేషశాయిముఖాన్ని తనపక్కకి తిప్పుకొనే ప్రయత్నంలో ఒక్కువెచ్చగా చేతికితగిలింది. కొంచెం ఆందోళన కలిగి ఏమిటాయనుకొని, మంచంమీదకూచుని తల గడమీద చేయిపడేవరకు అది చల్లగా ముద్దలా ఉంది.

"ఏమిటండీ: ఎందుకిట్లా?"

"............................"

"ఎందుకూ ఈదుఃఖం?"

"............................"

"చెప్పరుగదూ? నన్ను చంపుకొన్నంత ఒట్టే" అని అనేవరకు శేషశాయి లేచికూర్చొని రెండు చేతులూ సరోజిని మెడకుచుట్టి తల ఆమెభుజంమీదపెట్టి కళ్ళకు చిల్లులు పొడుచుకొని - ఆమెరవిక్కెను స్నానం చేయిస్తున్నాడు. సరోజినికి కంపంఎత్తుతూంది.

"సరోజినీ, నాకీపూట ఆకలిలేదు: అన్నం తినను"

"............................"

"తినలేను: నాకడుపులో నీవు చిచ్చుపెట్టి నోటిలో అన్నంపెట్టితే నేను తినగలనా?"

"............................"

"ఇన్నాళ్ళగా నాతోకాపురం చేస్తున్నావు గాని నామనస్సెట్టిదో నీవు తెలుసుకోలేక పోయినావు గదా! నాకానందం కలుగచేసేపనులు నీవు చేసినప్పుడు గదా నీ చేతి అన్నం నాకానందం కలుగ చేస్తుంది. ఈ రోజు నాజన్మలో దుర్దినం—"

"నే నేంచేశానండీ. అంత తప్పుపని చేసిన జ్ఞాపకం నాకేమీ లేదే?"

"అవును. అందుకనే నాదుఃఖం. నీవు రోజూ చేస్తూ ఉన్నది నీకుపరిపాటి అయిపోబట్టి నీకు తప్పుగా తోచదు. అదితప్పు అని ఇతరులు చెప్పితేగాని నీకు తప్పు అని తెలియదు. ఒకవేళ ఇతరులు చెప్పినా గూడ నీకు తప్పుగా తోచదేమో.

"............................"

"సరోజినీ! ఉదయంనుండి చూస్తున్నాను. నీ వింతకఠినహృదయవని నే ననుకోలేదు. అనేక గ్రంథాలు చదివావు. అనేక పత్రికలు చదువుతూ ఉంటావు. దేశమూ దేశభక్తి అంటే సరేనంటావు. కాని ఏమిప్రయోజనం? నీ ఇంటిముంగిట తాండవించే దరిద్రదేవతను తరిమివేయలేకపోతున్నావు. ఎందుకీ దోర్లాట? ఎవరికోరకు?"

"............................"

"పొద్దున్న నీవు చేసినకూరగాయలబేరం నీ కిప్పుడేమైనా జ్ఞాపకం ఉందా? ఆ బేరాలు చూచినప్పటినుండీ నాదుఃఖం ఇనుమడించింది. దమ్మిడీదగ్గర, నిట్టెడు గింజలదగ్గర వాళ్లను ఎంతేడిపించి పంపావు. ఛీ. ఛీ. ఇంత ఉదార శూన్యతగ్గల హృదయంకలదానవని నేననుకోలేదుసుమా. పనిచేయక, సోమరిపోతులయి, ముష్టి ఎత్తుకొని బ్రతకడం గౌరవంగా భావించి, ఏచితారో, ఏతాంబురాయో పట్టుకొని, ముఖాన్న విభూతి పెండికట్టులో, తిరుచూర్ణ రేఖలో ధరించి ఏ బ్రహ్మంగారి తత్వాలో పాడుకొంటూవస్తే తవ్వలతోనూ, సోలలతోనూ ఉపాదానం చేస్తావు. కాని అడుక్కొని తినడం ఇష్టంలేక, ఇతర పెద్ద పెద్ద వ్యాపారాలు చేసుకోవడం వీలులేక ఏ ఖూరో, ఏ కాయో, ఏ ఆకో, ఏ అలమో కష్టపడిమోసుకొని నీ యింటికాడికి అమ్ముకోనువస్తే వాళ్లతో ఆ బేరాలేమిటి? ఎన్నిదమ్మిడీలు

ఈ ప్రకారంగా మిగిల్చి నీ మెడలోని నాలుగువేల రూపాయల బంగారం బరువును మరింత వృద్ధిచేయాలనుకొన్నావు? పట్నవాసాల్లో షాపుల్లోనికిపోతే బేరంచేయ్యగూడదని పెద్దపెద్ద అక్షరాలు అచ్చువేయించి ఎదురుగా తగిలిస్తారే? మొన్న నీవు రెండు వందలరూపాయల చీరలూ రవికలూ కొనుక్కొన్నావుగదా: అప్పుడు ఈ బేరాలు చేయ్యలేక పోయినావేమి? ఈ వంకాయబేరాలు అక్కడ సాగవనేకాదూ? వీళ్లు దరిద్రులు గాబట్టి, నీవు ఐశ్వర్యవంతురాలవు గాబట్టి నీవు కొట్టినా తిట్టినా పడి ఉంటారని గదా నీకు ఈ వంకాయలదగ్గరా - పొన్నగంటాకు దగ్గరా - రేగుపళ్ల దగ్గరా. ఛీ: ఛీ: ఛీ: ఎందుకీ బేరాలు ...."

" ... ... "

"అబ్బా! తలుచుకొంటే కడుపుదహించుకొని పోతూంది. "బాలింతరాలిని రవికలేక బయటికి పోవాలంటే సిగ్గవుతుంది. ఒక్క పాతరవికె పారెయ్యమ్మా" అని నీవంటి ఆడది నోరువిడిచి అడిగితే అంతమాత్రం యివ్వడానికి నీకు మనస్సురాలేకపోయింది గదా: "అన్నంలేక పాలెండిపోయినై - ఒక్క పిడచ అన్నం పెట్టమ్మా" అని అడిగిన ఎరుకలదాని ఆకలి తీర్చలేక పోయినావు. ఆఖరుకు చంటిబిడ్డ మాడున పెట్టుకోను రవంత ఆముదంచుక్క పెట్టమని గోలపెట్టితే చెయ్యి ఊరుకోలేదని తలుపుబిగించి లోనికిపోయావు: నేనన్నీ గమనిస్తూనే ఉన్నాను: నీస్వాతంత్ర్యానికి భంగం కలిగితే నీవు ఆ సమయంలో ఓర్చుకోలేవని, సమయం చూచి నీకు నచ్చచెప్పాలి అని అప్పుడు నోరుమూసుకొని ఊరుకున్నాను. సరోజినీ! ఆడదాని మనస్సు మగవాని మనస్సుకంటె కోమలమయిందని అంటారుగాని నాకు నమ్మకం లేదు"

"........................"

"నేనిట్లా అంటున్నానని కోపపడకు. నా మనస్సు కుమిలి కుమిలి నీమీద నాకు గల ప్రేమ నన్ని రోజూ ఇట్లా అనిపిస్తూంది. నీవు దినమ్మూ చేసే చర్యలలోని అర్థం నీకు విపులంగా నచ్చచెప్పి నేనభిలషించిన విధముగా నిన్ను మార్చవలెననే నాకోరికగాని నీమీద నాకు అసూయా, ఆగ్రహం లేదు: తెలిసిందా. ఆఖరుకు నీచేత సుబ్బికొక పాతచీరైనా ఈ రోజు ఇప్పించలేకపోయాను నేను ఇవ్వేళ. ఆరునెలలయింది చీరయిచ్చి ఇప్పుడేమి తొందరన్నావు. నీవు ౬ గంటలకొకసారి చీర మార్చనిదే ఉండలేవే. అది ఆరునెలలకయినా చీరమార్చుటకు వాయిదా రానప్పుడు ఇంకా ఎప్పుడు వస్తుంది? నీ చీరెలూ, నీ రవికెలూ దాచిపెట్టుకోను ఒ బీరువాచాలక ఇంకో బీరువాను చేయించమని తొందర చేస్తున్నావు గదా! ఎందుకు నీకిన్ని చీరలు? రోజుకు పదిగంటలకాలం నీయింట్లో దాస్యం చేసి, నెలకు రూపాయి పావలా జీతం తీసుకొని జీవించే ఆడదానికి చీరలుకొనుక్కొను డబ్బు ఎక్కడనుంచి వస్తుందనుకొన్నావు. నిన్నాశ్రయించుకొన్న జీవియెడ నీకే కరుణలేనపుడు. ఇక బయటివాళ్లకెట్లా గలుగుననుకొన్నావు, 'వరికోతకు పోతాను. నాలుగు రోజులు శెలవు ఇవ్వవలసిం' దని కోరితే నీవు నిరాకరించినావటగా! అబ్బా! ఎంత కఠినహృదయం నీది సరోజినీ. ప్రేమలేని జన్మ నిరర్థకం. కరుణలేని జీవితం నిష్ఫలం. దయాదాక్షిణ్యాలు లేని జీవనం నిష్ప్రయోజనం! నిష్ప్రయోజనం! ఉప్పిక అవుతూంది. ఇన్నిమందినీళ్లు ఇయ్య..."

"........................"

"ఇంతకీ నేను చేసుకొన్న పాపఫలం కాకపోతే నీచేతికిందపనిచేసే నీవంటి ఆడదానియెడ నీవింత కాఠిన్యం వహించి, నాకింతదుఃఖం కలిగించి ఉండవు. ఆహా! తలచుకొంటే ఆశ్చర్యం కలుగుతుంది. నాకంటె రెట్టింపుగా నెలకి వందలకొద్దీ సంపాదించుకొని, తిన్నది హరించుకోలేక, అజీర్తివ్యాధిచే బాధపడే నావంటి ప్లీడరు శ్యామలరావు ఇంట్లో అడుగుపెట్టంగనే, అడగకుండానే పళ్లెంలో అమర్చి ఫలహారాలు ముందుపెట్టినావు. కాని చెమట ఊడ్చి నీకు ఊడిగంచేసే దాసిదానికి ఒక్క బేడడబ్బు లివ్వలేకపోయినావు. అబ్బా! ఈ రోజు దాని ప్రాణాలు మన ఇంట్లో అన్యాయంగా

పోయి ఉండునే! దాని గుడిశకుపోయి చూతును గదా, కుచేలుని సంతానంవలె దాని పిల్లలు పదిమంది తిన డానికి కూడులేక, నిన్నా ఈ రోజూకూడా పచ్చి చేపలు, పచ్చికప్పలు, పచ్చి ఎండ్రకాయలూ-బురదలో పట్టినవి. బురదయినా దులపకుండా తింటున్నారు. ఇక నాకు అన్నం నోటికెట్లాపోతుంది సరోజినీ! నీవు పోయి తిను. నాకు ఆకలి అడుగంటింది."

"..........................."

"దుఃఖించి ప్రయోజనంలేదు. నే నిట్లాగా, నీవట్లాగా కళ్ళనీళ్లుకారిస్తే ప్రయోజనం లేదు. మన కన్నీటిధార దారిద్ర్యదుఃఖాగ్నిని చల్లార్చి, ఈ జన్మలో ఒక్క జీవుని దుఃఖమైనా తొలగింపచేసినపుడు గదా మన జన్మ సార్థకం. అదిలేనపుడు మన జన్మ ఎందుకు ?......"

"..........................."

"సృష్టిలో కల్లా మానవజన్మ సర్వోత్కృష్ట మైనదని పెద్దలంటారు. అంతేగాదు, చాలా పవిత్రమైనదనిగూడా అంటారు. అట్టి పవిత్ర మైన జన్మలు పోషించుకొనేఅందుకు అన్నమూ, నీళ్లూ లేక, ఎన్ని మలమల మాడుతూ నశించి పోతు న్నాయో నీకు తెలియదు. నీ కాకలిబాధ ఎట్లాం టిదో తెలియదు గాబట్టి లోకంలో నీకాకలి బాధ ఉన్నదని నీవు తెలుసుకోలేక పోయావు. దారిద్ర్య దుఃఖం నీకు లేదు గాబట్టి లోకంలో అది లేదనుకొంటున్నావు. గడపదాటి బయట తలచూప వలసిన అవసరం నీకు లేదు గాబట్టి, లోకంలోవున్న దుఃఖం నీవెరుగవు. నీకాళ్లకు మొక్కకొని నీకు దాస్యంచేసే యానాదిదాని కడుపులోని బాధే నీకు తెలియనపుడు, ఇక బయటిబాధ నీకు ఎట్లా తెలు స్తుంది?"

"..................."

"నీసంసారంలో నీకింత స్వేచ్ఛ ఉన్నందుకు, నిన్నంటిపెట్టుకొని నిన్నాశ్రయించిన దరిద్రగొట్టు జీవుల్ని ఎందరిని నీవు ఉద్ధరించగలవో ఆలోచించుకో: నీభర్తమీద, నీపుత్రునిమీద నీవు ఎట్టి ప్రేమతో ప్రవ ర్తిస్తున్నావో అట్టి ప్రేమనే ఇతరజీవులమీద ప్రసరింప జేస్తే ఇట్టి అల్ప గుణాలు అలవడవు. సరోజినీ! ఇక నైనా నీమతంమార్చుకో. ఎన్నిరోజులనుండియో నీకీ విషయాలు చెప్పవలెనని అనుకోవడమేగాని నాకు అట్టి అవకాశం ఇదివరకు చిక్కలేదు.

"నాథా! నా తప్పులన్నీ క్షమించండి. ఇక మీదట మీ కోరికప్రకారమే ప్రవర్తించి మీకానందము కలుగచేసి దినములు గడుపుకొంటూ ఉంటాను. ఈతప్పు క్షమించి ఈపూట భోజనానికి లెండి."

"సరోజినీ! ఈనాడు నామనస్సులో గలిగిన ఈ దుర్భరమైన ఆవేదన ఈరాత్రి ఉపవాసవ్రతంవల్ల గాని చల్లారి, నాకు శాంతి కలుగదు. నే నీరాత్రి ఉప వసించి సర్వేశ్వరుని ప్రార్థిస్తూ గడపవలెనని నిశ్చయం చేసుకొన్నాను. నీవు మరొకలాగున అనుకోకు."

సరోజిని లోపల పొంగివచ్చేదుఃఖాన్ని ఆపుకో లేక అనేక విధమైన అవస్థలోపడి మనశ్శాంతికొరకై నాథుని పాదములపై వ్రాలి అతని పాదపద్మములను కన్నీటిధారచే అభిషేకించింది. పాదములపై చేయ బడిన అభిషేక శైత్యంవల్ల శేషశాయికి తలవేడి కొంత ఉపశమించినదిగాని, కడుపులో బాధ యింకా తగ్గ నందువల్ల 'లంఘనం పరమౌషధం' అని ఆరాత్రి సర్వే శ్వరుని ప్రార్థిస్తూ తన హృదయాన్ని ఆయన పద సాన్ని ధ్యాననిలిపి ధ్యానించుకోగా, కడుపులో వేడికూడా కొంతసేపటికి చల్లారగా నిద్రపట్టినది. సరోజినికూడా ఆరాత్రి అన్నంవర్జించి భర్త నిద్దురపోయినపిదపగూడా ఆయనకు శైత్యోపచారాలుచేసి, ఆరాత్రి భర్తను అను కరించి, తెల్లవారి లేచేవరకు ఆమెకు ఆకలిబాధ ఎట్లాం టిదో కొంత తెలిసింది.